ప్రజాశక్తి
శుక్రవారం 21 జులై 2023
5
అల్లూరి సీతారామరాజు



4886 ధ్రువపత్రాల పంపిణీ

- జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి -పాడేరు: అల్లూరి జిల్లాలో గురువారం నిర్వహించిన జగనన్న సురక్ష శిబిరాల్లో 4,866 ధ్రువపత్రాలు పంపిణీ చేసినట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 9 మండలాల పరిధిలోని 14 సచివాలయాల్లో జగనన్న సురక్ష ప్రత్యేక శిబిరాలు నిర్వహించామన్నారు. వివిధ సర్టిఫికెట్ల కోసం 11,408 గృహాల నుంచి వాలంటీర్ల యాప్‌లో 13,863 వినతులు రాగా, 15,066 టోకెన్లు నమోదు చేశామన్నారు.

12,542 దరఖాస్తులను ఆన్‌లైన్‌చేసి, అందులో 4,866 సర్టిఫికెట్లు పంపిణీ చేశామన్నారు. 22 దరఖాస్తులు తిరస్కరణకు గురికాగా, మిగిలిన వారికి రెండు, మూడు రోజుల్లో వాలంటీర్ల ద్వారా పంపిణీ చేస్తామన్నారు. గ్రామాల్లో నిర్వహించే జగనన్న సురక్ష శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ సూచించారు.

గోదావరికి వరద పోటు

- గురువారం సాయంత్రానికి భద్రాచలం వద్ద 43 అడుగులకు చేరిన నీటి మట్టం
- పొంగి ప్రవహిస్తున్న వాగులు వంకలు
- మూసుకుపోతున్న రహదారులు
- సురక్షిత ప్రాంతాలకు తరలిపోతున్న నిర్వాసితులు
- పాఠశాలలకు సెలవులు ప్రకటించిన కలెక్టర్



భద్రాచలం వద్ద 43 అడుగులకు చేరుకున్న గోదావరి నీటిమట్టం

ప్రజాశక్తి-చింతూరు

ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరి, శబరి నదులకు వరద పోటెత్తింది. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం గురువారం సాయంత్రానికి 43 అడుగులకు చేరటంతో అధికారులు మొదటి ప్రమాదక హెచ్చరికను జారీ చేశారు. గోదావరి ఎగువన ఉన్న శ్రీరామ్‌సాగర్, ఎల్లంపల్లి, కాళేశ్వరం, కంతనపల్లి, దుమ్ముగూడెం బ్యారేజీ నుండి నీరు ఏటూరునాగారం మీదుగా ప్రవహించి భద్రాచలం వద్ద గోదావరిలో కలుస్తోంది. తెలంగాణలోని దారిపేరు ప్రాజెక్టు నుండి భారీగా వరద నీరు చేరడంతో గురువారం మధ్యాహ్నం 25 గేట్లను ఎత్తి లక్ష క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. దీంతో భద్రాచలం వద్ద నీటిమట్టం ప్రమాద స్థాయిలో పెరిగింది. చింతూరు శబరి నది ప్రవాహం కూడా 30 అడుగులకు చేరడంతో శబరి రోడ్డు సంతపాకల ప్రజలు సర్దుకొని సురక్షిత ప్రాంతాలకు బయలుదేరారు.

భారీ వర్షాలకు చింతూరు మండలంలోని వాగులు వంకలు ప్రమాదవ స్థాయిలో పొంగి ప్రవహిస్తున్నాయి. మండలంలోని కుయుగూరు వాగు రోడ్డుపై నుంచి ప్రవహించడంతో ఆంధ్రా-ఒడిశా రహదారులు మూసుకుపోయి, రాకపోకలు ఆగిపోయాయి. సోకిలేరు, చీకటి వాగులు రోడ్డుపై వరద నీరు ప్రవహించడంతో చింతూరు -విఆర్.పురం మండలాలకు రవాణా స్తంభించింది. చత్తీస్‌ఘడ్‌లోని బీజాపూర్, సుకుమా జిల్లాల్లో శబరి ఉధృతి కొంతమేర తగ్గి శాంతించింది. అల్లూరి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ముంపు మండలాల్లో ప్రకటిస్తూ అధికారులను అప్రమత్తం చేశారు. చింతూరు మండలంలో 11 ఫ్లడ్ సెంటర్లను ఏర్పాటు చేశారు. వరదల దృష్ట్యా పాఠశాలలకు అల్లూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సెలవులు ప్రకటించారు.

వరద పరిస్థితిని సమీక్షించిన కలెక్టర్

జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ గురువారం రాత్రి 7 గంటలకు వరద పరిస్థితులపై సెక్టోల్ 4 మండలాల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. వరద వచ్చినప్పుడు, వరద తీసిన తర్వాత తీసుకోవాల్సిన జాగ్రత్తలను అధికారులకు వివరించారు.





జల్లివారి గూడెం వద్ద ఆర్ అండ్ బి రహదారిపై నుండి ప్రవహిస్తున్న వాగు



వరద బాధితులతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్

కాలనీల ఖాళీ

కూనవరం : వరద ఉధృతి పెరిగిన నేపథ్యంలో మండల కేంద్రంలోని ఉదయ భాస్కర్ కాలనీ, గిన్నెల బజార్ కాలనీలను ఖాళీ చేయించి కోతులగుట్టలోని పునరావాస కాలనీలకు తరలించారు. అంతే కాకుండా కొంతమంది సురక్షిత ప్రాంతాలలో 2 లేక 3 నెలలకు ఇళ్లు కిరాయికి తీసుకొని తరలి వెళ్తున్నారు.

మండలంలో పర్యటించిన కలెక్టర్..

ముంపు మండలాలలో వరద ముంచెత్తడంతో కలెక్టర్ సుమిత్ కుమార్ గురువారం కూనవరం మండలంలో పర్యటించారు. మండలంలో 2 పునావాస కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. లాంచీలను ఏర్పాటు చేశామని, వరద తీవ్రతను బట్టి మర పడవలు కూడా ఏర్పాటు చేస్తామని తెలిపారు.

ముంపు గ్రామాల్లో పర్యటించిన

సామగ్రితో వాహనాల్లో తరలివెళ్తున్న కూనవరం గ్రామస్తులు

సిపిఎం నేతలు

విఆర్.పురం : వరద ముంపునకు గురవుతున్న చోక్కనపల్లి, శ్రీరామగిరి, ఒడ్డుగూడెం, ఒడ్డుగూడెం కాలనీ, ధర్మతాల గూడెం తదితర గ్రామాల్లో సిపిఎం నాయకులు గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం చిన్నబాబు మాట్లాడుతూ టార్పాలిన్‌లు లేక స్థానిక గిరిజనులు ఇబ్బంది పడుతున్నారని, గుట్టలపై తాటాకు పాకలు వేసుకుంటున్నారని తెలిపారు. ముందు నుండి అధికార యంత్రాంగాన్ని హెచ్చరిస్తున్నా వరద సహాయక చర్యలు చేపట్టడంలో విఫలమయ్యారని విమర్శించారు. వడ్డుగూడెం, వడ్డుగూడెం కాలనీ, విఆర్ పురం ప్రజలు రేకపల్లిలోని గుడారాలు వేసుకొని ఉన్నారని, ప్రభుత్వం వారికి బరకాలుగాని, నిత్యావసర సరుకులుగాని అందించలేదని తెలిపారు. తక్షణమే వారికి అన్ని వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ పూనెం ప్రదీప్ కుమార్, పార్టీ నాయకులు పంకు సత్తిబాబు, తోడం రాజులు, గొంది దారయ్య, సోడి మల్లయ్య, పాల్గొన్నారు.

కలవర పెడుతున్న కాఫర్ డ్యామ్

ఎటపాక : భద్రాచలం వద్ద గోదావరి నీటి మట్టం వేగంగా పెరుగుతుండడంతో లోతట్టు ప్రాంతాల ప్రజలు భయంతో వణికిపోతున్నారు. గోదావరి ఎగువ వరద కంటే పోలవరం కాఫర్ డ్యాం ముంపు గ్రామాల ప్రజలను మరింత కలవరపెడుతుంది. గతంలో భద్రాచలం వద్ద 2వ ప్రమాద హెచ్చరిక (48అడుగులకు) జారీ చేసే వరకు ముంపు ఉండేది కాదు. కానీ నేడు మొదటి ప్రమాద హెచ్చరిక (43 అడుగులకు) చేరుకోక ముందే వరద ముంచెత్తుతుంది. గతంలో 48అడుగులు వస్తేనే మండలంలో వీరాయిగూడెం, మురుమూరు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయేవి. కానీ నేడు 41 అడుగులకే రహదారిపై రాకపోకలు ఆగిపోయాయి. పోలవరం ప్రాజెక్ట్ వద్ద కనీస నీటి మట్టం 41.15 మీటర్ల నిల్వ చేయకుండా వరదను ఎప్పటికప్పుడు కిందికి వదులుతుంటేనే ఇలాంటి పరిస్థితి దాపురిస్తే ప్రాజెక్ట్‌లో కనీస నీటిమట్టంతో నీరు నిలవ చేశాక వరద వస్తే తమ పరిస్థితి ఏమిటని ముంపు గ్రామాల ప్రజలు ప్రశ్నిస్తున్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న అధికారులు

వరద బాధలు భరించలేం



ప్రతి ఏటా గోదావరి వరదలకు మండలంలో ముందుగా మా గ్రామానికి రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఈ వరద ముంపు బాధలు భరించలేక పోతున్నాం. మా గ్రామాన్ని 41.15 ముంపు జాబితాలో చేర్చి పరిహారం చెల్లించాలని, భూమికి భూమి ఇవ్వాలని జులై 5న రాష్ట్ర మంత్రి అంబటి రాంబాబుని కలిసి తెలియజేశాం. వరద ముంపు గ్రామంగా చూడకుండా పోలవరం ముంపు గ్రామంగా పరిగణించాలని కోరాం. స్థానిక అధికారులు కూడా మా వాస్తవ పరిస్థితిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళి మొదటి ప్రాధాన్యత ముంపు గ్రామాల జాబితాలో చేర్చాలి.

- కొర్స భద్రమ్మ, నెల్లిపాక సర్పంచ్, వీరాయిగూడెం, ఎటపాక మండలం

భయంతో సురక్షిత ప్రాంతాలకు వెళ్తున్నాం



గతేడాది వరదల బీభత్సానికి తీవ్రంగా నష్టపోయాం. అందుకే ముందుగానే ఇంటి సామాన్లు సర్దుకొని సురక్షిత ప్రాంతాలకు నా కుటుంబంతో సహా వెళ్లిపోతున్నాం. శబరి ఒడ్డున ఉన్నందున మా గ్రామం ముంపుకు గురయ్యే ప్రమాదం ఉంది. వాగులు కూడా పొంగి ప్రవహించి వరద నీరు ఊరుని చుట్టూ ముడుతుంది. ఆపై బయటకు వెళ్లేందుకు దారులు ఉండవు. పోలవరం ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ, పరిహారం ఎంత త్వరగా అందజేస్తే మాకు అంత ఊరట కలుగుతుంది.

- కుకునూరు వెంకటేశ్వర్లు, కొయ్యగోరు గ్రామం, చింతూరు మండలం

ప్రభుత్వ సాయం అంతంత మాత్రమే..



గతేడాది వరదలకు మా గ్రామంలో 100 ఇళ్లకు పైగా ముంపునకు గురయ్యాయి. నా ఇల్లు పూర్తిగా మునిగిపోయి, రేకులు పడిపోయాయి. ఇంటి మరమ్మతుకు రూ.30 వేలు ఖర్చయింది. ప్రభుత్వం కేవలం రూ.2వేలు ఇచ్చి చేతులు దులుపుకుంది. ఇప్పుడు మళ్లీ వరదలు మమ్మల్ని వెంటాడుతున్నాయి. సామాన్లు సర్దుకుని సమీపంలోని గుట్టపైకి వెళ్లేందుకు సిద్ధపడుతున్నాం. ప్రభుత్వం ఈ సారైనా వరద సాయం అందించాలి.

- వెంకటలక్ష్మి, కోయగూరు, చింతూరు మండలం

వరదలు మళ్ళీ వెంటాడుతున్నాయి



గతేడాది వరదల బాధలు మరవకముందే మళ్లీ వరదలు వెంటాడుతున్నాయి. మళ్లీ వలస బాట పట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఫ్లడ్ షెల్టర్లకు వెళ్లాలంటే చింతూరు మండల కేంద్రం నుండి ఎర్రంపేటకు వెళ్లాలి. రవాణా ఖర్చులకు ప్రభుత్వం ఇచ్చే రూ.2వేలు సరిపోవడం లేదు.

- ముత్యాల మహేష్, కోయగూరు, చింతూరు మండలం

మూతబడిన పాఠశాల పునరుద్ధరణ

ఫలించిన సిపిఎం, ఆదివాసీ గిరిజన సంఘం, ప్రజల పోరాటం



మదుం పాఠశాలను ప్రారంభిస్తున్న ఎంఇఒ, వైస్‌ఎంపిపి

ప్రజాశక్తి -హుకుంపేట: విద్యార్థులు తక్కువగా ఉన్నారన్న నెపంతో రేషనలైజేషన్ పేరుతో మూసేసిన మండలంలోని మెరకచింత, గన్నేరుపుట్టు పంచాయతీ మధుము మండల పరిషత్ పాఠశాలను గురువారం పున:ప్రారంభించారు. 2015లో పాఠశాలను మూసేయడంపై సిపిఎం, ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చేపట్టారు. ఎట్టకేలకు వారి పోరాటం ఫలించి, ఇపుడు పాఠశాలను పున:ప్రారంభించారు.

గురువారం ఎంఇఒ సోమెలి చెల్లయ్య, డిప్యూటీ ఎంఇఒ కూడా ఈశ్వరరావు, వైస్ ఎంపిపి సూడిపల్లి కొండలరావు, మెరకచింత సర్పంచ్‌తో కలిసి పాఠశాలను పునరుద్ధరించారు. పాఠశాలను మూసేయడంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో పక్క గ్రామాలకు వెళ్లి చదువుకునేందుకు నానా ఇబ్బందులు పడిన మదుం గ్రామ గిరిజన విద్యార్థులు తమ గ్రామంలోని పాఠశాలను పునరుద్ధరించంపై ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో గన్నేరుపుట్టు, చీకుమద్దుల, మెరకచింత సర్పంచ్‌లు ఎస్ కృష్ణారావు, ఎస్ బొంజన్న దొర, పి. పద్మకుమారి, మెరకచింత మాజీ సర్పంచ్ సిపిఎం మండల కార్యదర్శి వలసనేని లక్ష్మణరావు, మెరకచింత నేత దూసూరు వెంకటరావు, సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్ కామేశ్వరరావు, స్కూల్ టీచర్లు బాకూరు రాజుబాబు, బాకూరు గోపాలరాజు, బాకూరు పుష్పాలమ్మ, వైస్ సర్పంచ్‌లు పూజారి రమణ బాబు, గెమ్మిలి సింహాచలం, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి -హుకుంపేట:మండలంకేంద్రంలో స్థానిక పెట్రోల్ బంక్ పక్కన అంబేద్కర్ విగ్రహం ఆవరణలో ప్రహరీ నిర్మాణానికి జెడ్‌పిటిసి రేగం మత్స్యలింగం గురవారం శంకుస్థాపన చేశారు. రూ.నాలుగు లక్షల జిల్లా పరిషత్ నిధులతో దీన్ని నిర్మించనున్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సమీడ వెంకటపూర్ణిమ, వైస్ సర్పంచ్ గోవిందు, మెరకచింత సర్పంచ్ దూసురి పద్మకుమారి, శోభకోట సర్పంచ్ చిన్నారావు, గడికించుమండ సర్పంచ్ వర్తన ఈశ్వరి, సుకూరు సర్పంచ్ మురళి, పాంగి సాంబ, వైసిపి జిల్లా మీడియా కన్వినర్ తడబారికి సురేష్, నాయకులు గండేరు సత్యం, యువనేతలు అనిల్,గెమ్మెలి వెంకట్, దూసురి వెంకట్, చిన్నేశ్వరరావు వార్డ్ మెంబెర్ పాడి వెంకట్ పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న జెడ్‌పిటిసి మత్స్యలింగం, సర్పంచ్ వెంకట పూర్ణిమ తదితరులు

పెదవలసలో తాగునీటికి కటకట!

- మూడునెలలుగా మూలకు చేరిన నీటి పథకం
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు
- కలుషిత నీటితో గిరిజనుల అవస్థలు



దూరాన బావి నుండి తాగునీటిని తీసుకుంటున్న గిరిజన మహిళలు

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: మండలంలోని మారుమూల లోతేరు పంచాయతీ పెదవలస గ్రామంలో గిరిజనులు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలోని రక్షితనీటి పథకం విద్యుత్‌మోటర్ మూడు నెలలుగా మరమ్మతుకు గురైంది. దీంతోగ్రామంలో నివసిస్తున్న సుమారు 140 ఆదివాసీ గిరిజన కుటుంబాలు అవస్థలు పడుతున్నారు. దీంతో బిందెడు తాగునీటి కోసం గ్రామానికి కిలోమీటర్ల దూరంలో ఉన్న బావి వద్దకు కాలినడకన వెళ్లి నీరు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వర్షాకాలంలో ఆ బావిలోని నీరు బురదమయమైనప్పటికీ, గత్యంతరం లేని ఆ కలుషిత నీటినే తాగుతూ అనారోగ్యం పాలౌతున్నామని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. దీనిపై పంచాయతీ సర్పంచ్, పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. లక్షలాది రుపాయల ప్రజాధనంతో నిర్మించిన రక్షితనీటి పథకం విద్యుత్ మోటారు మరమ్మతుకు గురై మూలకు చేరినప్పటికీ, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు కూడా పట్టించుకోకపోవడం దుర్మార్గమని అంటున్నారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి, మరమ్మత్తుకు గురైన రక్షితనీటి పథకం విద్యుత్ మోటర్ మరమ్మతులు చేపట్టి తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు



రక్షితనీటి పథకం నీటి ట్యాంకు .. మరమ్మతుకు గురైన విద్యుత్ మోటార్

విధులకు డుమ్మా కొట్టిన టీచర్లపై కొరడా ఝుళిపించిన కలెక్టర్

- ఇద్దరు ఉపాధ్యాయులను విద్యాశాఖ ముఖ్య కార్యదర్శికి సరెండర్
- ఆయా పాఠశాలల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లకు డిఇఒకు ఆదేశం

ప్రజాశక్తి పాడేరు : తరచూ పాఠశాలకు డుమ్మాకొడుతూ, విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉన్న ఇద్దరు ఎస్‌జిటి ఉపాధ్యాయులపై జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ కొరడా ఝుళిపించారు. పెదబయలు మండలం సంపంగిపుట్టు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఎస్‌జిటి ఉపాధ్యాయులు కోనాడ విజయలక్ష్మి, రొంగలి శంకరరావులను ప్రభుత్వానికి సరెండర్ చేస్తూ జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ గురువారం ఉత్తర్వులు జారీ చేసారు. విధుల పట్ల నిర్లక్ష్యం, అంకితభావం లేకుంటే ఉపేక్షించేది లేదని, కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

వివరాలలోకి వెళ్తే... ఈ నెల 17న అరకు ఎమ్మెల్యే చెట్టి ఫాల్గుణ సంపంగిపుట్టు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నప్పుడు గ్రామస్తులు ఆయా ఉపాధ్యాయులపై ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే వెంటనే స్పందించి కలెక్టర్,డిఇఒల దృష్టికి సమస్యను విన్నవించడంతో బాధ్యులైన ఉపాధ్యాయులు ఎంఇఒ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. తదుపరివిచారణ చేపట్టి కలెక్టర్, డిఇఒలకు నివేదించారు. నివేదిక ఆధారంగా విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నట్లు నిర్థారణకు వచ్చి దీనిపై పాఠశాల విద్య ముఖ్యకార్యదర్శికి నివేదించి, తదుపరి చర్యలకు సిఫార్సు చేశారు.

ఇద్దరు ఉపాధ్యాయులు ప్రతినెలా పూర్తి జీతం తీసుకుంటూ ఉద్దేశ్యపూర్వకంగానే విధులకు డుమ్మా కొడుతున్నట్లు పేర్కొన్నారు. ఇద్దరు ఉపాధ్యాయులను విద్యాశాఖ కమిషనర్‌కు సరెండర్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. తక్షణమే వారిద్దరూ విద్యాశాఖ ముఖ్యకార్యదర్శికి రిపోర్టు చేసేలా చర్యలు చేపట్టాలని డిఇఒకు ఆదేశించారు. సంబంధిత పాఠశాలల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని డిఇఒ సలీం భాషాను కలెక్టర్ ఆదేశించారు.

ఓటర్ల జాబితా ధ్రువీకరణకు / నేటి నుంచి ఇంటింటా సర్వే



మాట్లాడుతున్న జెసి శివశ్రీనివాస్

ప్రజాశక్తి -పాడేరు : ఓటర్ల జాబితా ప్రక్షాళనకు ఈనెల 21వ తేదీ నుండి వచ్చేనెల 21వరకు బూత్ స్థాయి అధికారులు ఇంటింటికి సర్వే చేపడతారని జాయింట్ కలెక్టర్ జి. శివశ్రీనివాసు తెలిపారు.. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరం అన్ని రాజకీయపార్టీల ప్రతి నిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ. రాజకీయ పార్టీలు బూత్‌స్థాయిలో ఏజెంట్లను నియమించాలని సూచించారు. బూత్ స్థాయిలో ఓటర్ల జాబితా సర్వేలో భాగంగా ఫారం-6లో ఓటరు నమోదు, ఫారం 7లో ఓటరు తొలగింపు, ఫారం 8లో ఓటరు మార్పులు చేర్పులు చేస్తారన్నారు. దీనికి రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. పంచాయతీల ద్వారా మృతి చెందిన ఓటరు వివరాలు సేకరించామని, వాటిని నిర్ధారించుకున్నాక తొలగిస్తామన్నారు. ఓటరుకు రెండుచోట్ల ఓటు హక్కు ఉండ కూడదన్నారు. మండల స్థాయిలో బూత్‌స్థాయి అధికారులు, బూత్ ఏజెంట్లతో తాహశీల్దారులు సమావేశాలు నిర్వహించాలని సూచించారు.ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాలను పెంచాలని రాజకీయపార్టీల నేతలు కోరగా, ప్రతిపాదనలు ఇస్తే, సమీక్షించి, ఎన్నికల సంఘానికి ఆమోదం కోసం నివేదిస్తామన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పివిటిజి ఓటర్లు నమోదు చేపట్టి, కనీసం 18వేలమందిని చేర్పించాలన్నారు. ఓటర్ల జాబితాలలో 13225 అనుమానిత పేర్లను గుర్తించామని వాటిని విచారణ చేసి పరిశీలించి తొలగిస్తామన్నారు. సమావేశంలో డిఆర్ఒ.పి.అంబేద్కర్, వివిధ రాజకీయపార్టీల నేతలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి జగనన్న సురక్ష

ఐటిడిఎ పిఒ అభిషేక్



జగనన్న సురక్ష శిబిరంలో మాట్లాడుతున్న పిఒ అభిషేక్

ప్రజాశక్తి పాడేరు: స్పందనలో అధికారులే కార్యాలయాలకు వచ్చి సమస్యలను విన్నవించే పరిస్థితి ఉంటే, జగనన్న సురక్షలో అధికారులు, నేతలు నేరుగా ప్రజల వద్దకు వచ్చి వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తున్నారని ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి వి.అభిషేక్ స్పష్టం చేసారు. గురువారం మండలంలోని ఐనాడ గ్రామంలో జగనన్న సురక్ష శిబిరంలో పాల్గొని మాట్లాడుతూ, గ్రామ సచివాలయాల ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు చేరుతున్నాయన్నారు. అవగాహనాలేమితో కొందరు సంక్షేమ లబ్ధిని, సర్టిఫికెట్లను పొందలేని పరిస్థితుల్లో అధికారులే స్వయంగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి13 రకాల సేవలు అందిస్తున్నారన్నారు. అయినాడలో 27మందికి అక్కడికక్కడే సర్టిఫికెట్లను అందజేయగా, దరఖాస్తు చేసుకున్న మరో 578మందికి వారంరోజుల్లో అందజేస్తామన్నారు. త్వరలో ఐటిడిఎ పరిధిలో మూడున్నర లక్షల మందికి సాగుహక్కు పట్టాలను అందజేస్తామన్నారు. 32అంగన్వాడీలకు కొత్త భవనాలు రానున్నాయని, వాటిలో ఐనాడ కూడా ఉందని స్పష్టం చేశారు. ట్రైకార్ చైర్మన్ శతక బుల్లిబాబు మాట్లాడుతూ ప్రభుత్వయంత్రాంగం ప్రజలకు చేరువలో ఉండి వారి సమస్యలను పరిష్కరిస్తారన్నారు. అనంతరం ఐనాడ, రాయిపాలెం ఎంపిపి పాఠశాలలను, ఈదులపాలెం పిహెచ్‌సిని ఐటిడిఎ పిఒ అభిషేక్ తనిఖీచేశారు. వాతావరణ మార్పుల నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. కార్యక్రమంలో తాహాశీల్దార్ వి. త్రినాధరావునాయుడు పాల్గొన్నారు.

రోడ్ల విస్తరణ పేరుతో ప్రజలను పక్కదారి

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : రోడ్ల విస్తరణ పేరుతో ప్రజలను నర్సీపట్నం ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ పక్కదారి పట్టిస్తున్నారని, ఈ అంశం కోర్టు పరిధిలో ఉంటే విస్తరణ పనులను ఎలా ప్రారంభిస్తారని జన సేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్‌ఛార్జి రాజాన వీర సూర్యచంద్ర ప్రశ్నించారు. శుక్రవారం నుంచి రోడ్ల విస్తరణ పనులు ప్రారంభిస్తామని ప్రకటన రావడంతో స్పందించిన జనసేన నాయకులు వివిధ అంశాలపై గురువారం నర్సీపట్నం ఆర్‌డిఓ జయరామ్‌కు, మున్సిపల్ కమిషనర్ కనకరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సూర్యచంద్ర మాట్లాడుతూ నర్సీపట్నం ప్రధాన రోడ్డు విస్తరణ ఎంతో అవసరమని, దీనికి జనసేన తరపున పూర్తి మద్దతు ఉంటుందన్నారు. అయితే రోడ్డు విస్తరణ అంశంకోర్టు పరిధిలో ఉండగా ఎలా చేస్తారని ప్రశ్నించారు. టెండర్ ప్రక్రియ పూర్తి కాకుండా భవనాలను కూల్చేస్తే కొత్త సమస్యలు ఉత్పన్నమౌతాయన్నారు. రోడ్డును ఆనుకుని ఉన్న డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తమై ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. జలజీవన్ మిషన్ పథకంలో రూ.166 కోట్లతో ఇంటింటికి కుళాయిల ఏర్పాటుకు రోడ్లను తవ్వేసి పైపులు వేసిన కాంట్రాక్టర్, బిల్లులు చెల్లించక పారిపోయాడన్నారు. రోడ్డు విస్తరణలో పంతం నెగ్గించుకోవడానికి ఎమ్మెల్యే దూకుడు ప్రదర్శిస్తున్నారని, దీని వల్ల భవిష్యత్‌లో ఇబ్బందులు తప్పవన్నారు. వెంకటేశ్వరస్వామి గుడి నుండి కొత్తవీధి మీదుగా పెదబొడ్డేపల్లి వరకు రోడ్డు విస్తరణను ఎందుకు చేపట్టలేదో ఎమ్మెల్యే సమాధానం చెప్పాలన్నారు.కార్యక్రమంలో మారిశెట్టి రాజా, కర్రి సంతోష్, వాసం వెంకటేష్, బంగారు నాయుడు, పోలుపర్తి సూరిబాబు, వేగిశెట్టి శ్రీనివాస్, మాకిరెడ్డి వెంకటరమణ పాల్గొన్నారు.

ఓటర్ల ధ్రువీకరణ సర్వేకు సహకరించండి

ప్రజాశక్తి -నక్కపల్లి : ఈ నెల 21వ తేదీ నుండి గ్రామాల్లో జరగనున్న ఓటరు జాబితాల ధ్రువీకరణ సర్వేకు అన్ని రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని పాయకరావుపేట నియోజకవర్గ ఎలక్టోరోల్ రిటర్నింగ్ అధికారిణి కెవి.రామలక్ష్మి కోరారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ నాయకులతో సమావేశంలో మాట్లాడారు .బూత్ లెవెల్ అధికారులు ఈనెల 21వ తేదీ నుండి ఇంటింటికి వెళ్లి ఓటరు జాబితా ప్రకారం ఓటర్లను ధ్రువీకరించి నమోదు చేస్తారన్నారు.కొత్త ఓటర్లు చేర్పు, మరణించిన ఓటర్ల తొలగింపు ,ఓటర్లు ధ్రువీకరణపై జరుగు ప్రక్రియలో రాజకీయ నేతలు సహకరించాలని కోరారు సమావేశంలో తహశీల్దార్లు అంబేద్కర్, జయప్రకాశ్, ఇఓపిఆర్‌డి వెంకట నారాయణ, పలు పార్టీల నాయకులు కొప్పిశెట్టి వెంకటేష్, శీరం నర్సింహమూర్తి, కొణతాల శ్రీనివాసరావు, బి నాగేశ్వరరావు, ఎం సత్యనారాయణ , బంగార్రాజు, ఈశ్వరరావు, పాపారావు, పోలనాటి నానాజీ, కె.అప్పలరాజు పాల్గొన్నారు.

అటవీ గోదాముల్లో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : ఏపి ఫారెస్ట్ డెవలప్మెంట్ డైరెక్టర్ నైనార్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఫారెస్ట్ గోదాములను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గొడౌన్‌లలో స్టాక్ వేసిన కాఫీ గింజలను, మిరియాల నిల్వలను పరిశీలించారు. మిషనరీ పనితీరును, గోదాం సామర్థ్యానికి తగ్గట్టుగా ఉందాయనిఅడిగి తెలుసుకున్నారు. సిబ్బంది సమస్యలపై ఆరా తీశారు. గోదాంతోపాటు సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని భరోసానిచ్చారు. కార్యక్రమంలో రేంజర్ ఆఫీసర్ భవాని మంగతాయారు, చింతపల్లి డివిజన్ మేనేజర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు

పాదయాత్ర అనుమతికి వినతి

ప్రజాశక్తి -నక్కపల్లి : హెటిరో కొత్త పైపులైన్ సమస్యను అనకాపల్లి జిల్లా కలెక్టర్ దష్టికి తీసుకువెళ్లేందుకు చేపట్టనున్న పాదయాత్రకు అనుమతి ఇప్పించాలని పలువురు మత్స్యకారులు కోరారు. గురువారం నర్సీపట్నంలో ఎఎస్‌పి ఆదిరాజ్ రాణాను కలిసి వినతిపత్రం అందజేసినట్లు ఏపి మత్స్యకార జెఎసి రాష్ట్ర కన్వీనర్ పిక్కి స్వామి తెలిపారు. కంపెనీ వ్యర్థ జలాలు సముద్రం, ఉప్పుటేరులోకి వదలడం వలన మత్స్యసంపద నశించి పోతుందని, దీనివలన తాము ఉపాధి కోల్పోతున్నామని ఆవేదన వెలిబుచ్చారు. హెటిరో కంపెనీ కొత్తగా వేస్తున్న పైప్‌లైన్‌కు వ్యతిరేకంగా తామంతా 590 శాంతియుతంగా ఆందోళన చేస్తున్నప్పటికీ ప్రభుత్వం గానీ, అధికారులు గానీ పట్టించుకోకపోవడంతో కలెక్టర్ ను కలవడానికి నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ఈ నెల 31న సోమవారం కలెక్టరేట్ స్పందనలో విన్నవించేందుకు 30న ధర్నా శిబిరం నుంచి పాదయాత్రకు వెళ్లేందుకు పర్మిషన్ ఇప్పించాలని ఎఎస్‌పిని కోరారు. పర్మిషన్ కోసం చలానా చెల్లించామన్నారు. కార్యక్రమంలో పిక్కి తాతీలు, యజ్జల నాగరాజు, పిక్కి కోటి, గొర్ల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ

ప్రజాశక్తి-గొలుగొండ : అభాగ్యులు, నిరుపేదలకు తోచిన సహాయం అందించడమే తమ లక్ష్యమని స్నేహంజలి ఫర్ పూర్ సభ్యులు తెలిపారు. గురువారంగొలుగొండ, జోగంపేట గ్రామాల్లో 50 నిరుపేద కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.500 విలువ చేసే నిత్యావసర సరుకులు అందజేశారు.

విఆర్‌ఎల డిమాండ్లు నెరవేర్చాలి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు : దీక్షలకు సంఘీభావం



దీక్షకు మద్దతు తెలుపుతున్న వి.ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: కనీస వేతనం రూ.26 వేలు అమలు, ,సీనియార్టీ ప్రకారం ప్రమోషన్ ఇతర సమస్యలను పరిష్కరించాలన్న డిమాండ్లలో సంఘం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు గురువారం అరకులోయ మండల తహశీల్దార్ కార్యాలయం వద్ద విఆర్‌ఎల సంఘం ఆధ్వర్యంలో దీక్ష చేపట్టారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి ఉమామహేశ్వరరావు పాల్గొని, విఆర్‌ఎల దీక్షకు మద్దతు తెలిపారు.ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ విఆర్‌ఎలతో వెట్టిచాకిరీ చేయించుకుంటూ వారి న్యాయమైన డిమాండ్లను నెరవేర్చడంలో ప్రభుత్వాలు అన్యాయం చేస్తున్నాయన్నారు. పాదయాత్రలో ఇచ్చిన హామీని నాలుగున్నరేళ్లు దాటిని సిఎం జగన్ అమలు చేయలేదన్నారు. విఆర్‌ఎ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నరాజి అప్పారావు మాట్లాడుతూ, విఆర్‌ఎలను నాలుగోతరగతి ఉద్యోగులుగా గుర్తించాలని, 60ఏళ్లు నిండిన విఆర్‌ఎల కుటుంబాల్లోని వారసులకు ఉద్యోగం ఇవ్వాలని, ఎటువంటి అర్హత పరీక్ష లేకుండా సీనియార్టీ అధారంగా గ్రేడ్-1విఆర్‌ఒలుగా ప్రమోషన్ కల్పించాలని కోరారు. తమ సమస్యలను పరిష్కరించకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో విఆర్‌ఎల సంఘం సభ్యులు కొర్ర తిమోతి, మామిడిపల్లి వెంకటరావు, ముత్తి సరోజిని, రాజు బాబు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: సమస్యల పరిష్కారానికి విఆర్‌ఎల సంఘం నేతలు చేపడుతున్న దీక్షలను స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద మండల వైస్ ఎంపిపి- 1 పి.సత్యనారాయణ, లక్ష్మీపురం సర్పంచ్ కె.త్రినాథ్ ప్రారంభించారు. విఆర్‌ఎలకు పూలమాలలు వేసి దీక్షల్లో కూర్చొబెట్టి వారికి సంఘీభావం తెలపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విఆర్‌ఎల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో సిఐటియు ఉపాధ్యక్షులు పి భీమరాజు, ఆదివాసి గిరిజన సంఘం జిల్లా నాయకులు కె. నరసయ్య, గ్రామ సేవకుల సంఘం మండల అధ్యక్షులు చిన్న, కార్యదర్శి పరశురాం, లోహిదాస్, శ్యామ్, దేవన్న, పోలయ్య పాల్గొన్నారు.



ముంచంగిపుట్టులో దీక్ష చేస్తున్న విఆర్‌ఎలు

గిరిజన యువకునిపై మూత్రం పోసిన..

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

అంబేద్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ నిరసన



అంబేద్కర్ విగ్రహం వద్ద ఆందోళన చేస్తున్న కాంగ్రెస్ నేతలు

ప్రజాశక్తి -డుంబ్రిగుడ : ప్రకాశం జిల్లా ఒంగోలు పట్టణంలో గిరిజన యువకుడు నవీన్‌పై మూత్రం పోసి, దుర్భాషలాడిన గిరిజనేతరుడు ఎం రామాంజనేయులుతోపాటు అతనికి సహకరించిన వారిపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినచర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నేతలు కోరారు. గురువారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ రాష్ట్ర కమిటీ నాయకుడు పి చిన్నస్వామి మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దళిత గిరిజనులపై భౌతిక దాడులు జరుగుతున్నా వాటి నియంత్రణలో ప్రభుత్వాలు తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నాయని విమర్శించారు. దీనిపై ఎస్‌టి కమిషన్ జోక్యం చేసుకుని, గిరిజన యువకుడిపై మూత్రం పోసిన వారిపై కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు పి గంగాధర్, టి సోమేశ్వరరావు, జి వెంకటబాబు, కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు అలవర్చాలి

ప్రజాశక్తి-పాయకరావుపేట : విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించుకుంటే భావితరం నేతలుగా నిలుస్తారని శ్రీ ప్రకాష్ విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి విజయ్ ప్రకాష్ అన్నారు. గురువారం శ్రీ ప్రకాష్ పాఠశాలలో స్కూల్ కెప్టెన్, వైస్ కెప్టెన్, హౌస్ కెప్టెన్‌ల ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సంయుక్త కార్యదర్శి విజయ్ ప్రకాష్ మాట్లాడుతూ, విద్యార్థి దశలో బాధ్యతాయుతంగా ఉంటే, భవిష్యత్‌లో మార్గదర్శకులుగా నిలుస్తారన్నారు. రేపటి తరానికి కావలసిన నాయకత్వ లక్షణాలు విద్యార్థి దశలోనే నేర్చుకుని అద్భుత ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ అపర్ణ, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కనోసా విద్యాసంస్థల్లో...

పాయకరావుపేట : బాధ్యతల సక్రమ నిర్వహణే నాయకత్వ లక్షణమని కనోసా ఇంగ్లీష్ మీడియం విద్యాసంస్థల ప్రిన్సిపాల్ సిస్టర్ సంతాన అన్నారు. గురువారం పాఠశాలలో విద్యార్థి సంఘాల ఎన్నికలను నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ కెప్టెన్, వైస్ కెప్టెన్ హౌస్ కెప్టెన్‌లను క్రీడలు, గ్రూప్ డిస్కషన్, రాత పరీక్ష, వ్యక్తిగత ఇంటర్వ్యూ తదితర అంశాల ఆధారంగా ఎంపిక చేశారు. అనంతరం వారి వారి ప్రమాణ స్వీకారం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన మార్చ్‌ఫాస్ట్‌లో గౌరవ వందనం స్వీకరించి, నాయకత్వ బాధ్యతలు సక్రమంగా నిర్వహించేలా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పిల్లో, పిఇటి శ్రీను సంధ్యారాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు

14వ రోజుకు రిలే దీక్షలు

ప్రజాశక్తి -కోటవురట్ల: అణుకు గ్రామానికి రహదారి పాఠశాల నిర్మాణం చేపట్టాలంటూ గ్రామస్తులు చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు గురువారం 14వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా మోకాళ్లపై నిరసన చేపట్టారు పాఠశాల. రోడ్డు నిర్మాణం చేపట్టాలని గిరిజనులు శిబిరం వద్ద నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మండల సిపిఎం జిల్లా నాయకులు అప్పలరాజు మాట్లాడుతూ తమ న్యాయమైన కోరికలు తీర్చే వరకు దీక్ష విరమించేది లేదని స్పష్టం చేశారు. మండల సిపిఎం నాయకులు డేవిడ్‌రాజు పాల్గొన్నారు.

సిహెచ్‌సిలో జనరిక్ మందుల దుకాణం


ప్రజాశక్తి -కోటవురట్ల : కోటవురట్ల సిహెచ్‌సిలో జనరిక్ మందులు షాపు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు డిఆర్‌డిఎ పిడి లక్ష్మీపతి తెలిపారు. గురువారం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఆవరణలో నూతనంగా నిర్మించిన షాపును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 10 జనరిక్ మందుల షాపులు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు, జనరిక్ మందుల వాడకంలో ఎటువంటి అపోహలు అవసరం లేదని అన్ని వర్గాల ప్రజలకు, అన్ని రకాల మందులు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. వెటర్నరీ మందులు కూడా అందుబాటులో ఉంచనన్నట్లు తెలిపారు, మండలంలో రాజుపేట గ్రామంలో కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించామని, కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటుతో రైతులు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి రాంబాబు, ఎపిఎం రమణకుమారి, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

అడ్డంగా తూము నిర్మాణంపై ఫిర్యాదు

ప్రజాశక్తి-రోలుగుంట :మండలంలో కంచుగుమ్మల రెవెన్యూ పరిధిలో చింతలబంద చెరువుకు నీరు వచ్చే ఫీడర్ ఛానల్‌కు అడ్డంగా తూములు నిర్మించిన చిటికెల వెంకటసత్యనారాయణ అనే రైతుపై ఆయకట్టు రైతులు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుపై గురువారం సాయంత్రం ఇరిగేషన్ ఎఇ బండారు సత్యనారాయణ, ఆర్ఐ రామ్మూర్తి సందర్శించి ఫీడర్ ఛానల్‌కు మధ్యలో తూము ఏర్పాటుతో చెరువుకు నీరు పోదని, దీంతో ఆయకట్టుకు నష్టం వాటిల్లుతుందన్నారు. సైడ్‌వాల్ నిర్మాణం కూడా సరికాదన్నారు. ఈ సందర్భంగా ఆయకట్టు రైతులు బండారు శ్రీనివాసరావు, సుర్ల నరసింహమూర్తి మాట్లాడుతూ ఈ ఫీడర్ చానల్ ద్వారా చితలబంద, బండారుబంద, ముక్కిబంద, బొందలబంద సుమారు 100 ఎకరాల ఆయకట్టుకు నీరు అందుతుందని,అడ్డంగా తూమునిర్మించడం వల్ల నష్టం వాటిల్లుతుందని, నిర్మించిన తూము, సైడు వాల్ తొలగించాలని కోరారు.

ఉన్నత పాఠశాలకు రహదారి సౌకర్యం

ప్రజాశక్తి-మాడుగుల : మండలంలోని ఎం కోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు సిసి రోడ్డు నిర్మాణ పనులు గురువారం ప్రారంభమయ్యాయి..ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు ఆదేశాల మేరకు, సర్పంచ్ గొల్లవిల్లి సంజీవరావు ఆధ్వర్యంలో పనులు చేపట్టారు. కార్యక్రమంలో వైసిపి గ్రామ శాఖ అధ్యక్షులు పడాల అప్పలనాయుడు, పిఎసిఎస్ అధ్యక్షులు గొల్లవిల్లి రాజేష్, పాఠశాల కమిటీ చైర్మన్ కోన అన్నపూర్ణ పాల్గొన్నారు.



సమీక్ష నిర్వహిస్తున్న తహశీల్దార్ సుబ్రహ్మణ్యం ఆచారి

బిఎల్‌ఒలు ఇంటింటి సర్వే నిర్వహించాలి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మండలంలోని బూత్ లెవెల్ అధికారులు తమ పరిధిలోని ఇంటింటికి ఓటర్ జాబితాతో వెళ్లి ఓటర్ల సర్వే నిర్వహించాలని స్థానిక తాహశీల్దార్ వైవి సుబ్రహ్మణ్యం ఆచారి సిబ్బందిని ఆదేశించారు. స్థానిక తాహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం బూత్ లెవల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్య ఆచారి మాట్లాడుతూ, ఒక కుటుంబానికి చెందిన ఓటర్లు ఒకే చోట ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. 18, 19 వయసు కలిగిన ఓటర్లను నమోదు చేయాలని, 17 ఏళ్లు పైబడి వయసు కలిగిన యువతి యువకుల పేర్లు నమోదు చేయాలని సూచించారు. కుటుంబంలో ఒక వ్యక్తి వేరే ప్రాంతంలో ఉన్నట్లయితే ఓటర్ జాబితా నుండి తొలగించాలన్నారు. ఆధార్ కార్డులో ఉన్న ఇంటి నెంబర్ ఓటర్ జాబితాలో ఉన్న ఇంటి నెంబర్ ఒకేలా ఉండేలా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ఫిషరీస్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పవన్ కల్యాణ్‌పై విమర్శలు సరికాదు

ప్రజాశక్తి-కొయ్యూరు : జనసేన అధినేత పవన్ కళ్యాణ్ వృత్తి విషయమై పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి విమర్శలు చేయడం సరికాదని జనసేన మండల నాయకులు సాగిన బుజ్జిబాబు, గూడెపు లక్ష్మణ్ అన్నారు. గురువారం వారు స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ నటన వేరు, నిజ జీవితం వేరని, అసలు ఎవరి నిజ జీవితం ఏమిటో అందరికీ తెలుసని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఏ పోరాటం చేసి 16 నెలలు జైలులో ఉన్నారని ప్రశ్నించారు. పవన్ కల్యాణ్ తన సొంత డబ్బులతో ఎన్నో సేవ కార్యక్రమాలు చేశారని, 3 వేల మంది కౌలు రైతులకు రూ.30 కోట్లు దానం చేశారని తెలిపారు. ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి జీవో3పైనా, ఏజెన్సీలో హెచ్చుమీరుతున్న మైనింగ్‌పైనా, బోయ వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చడంపైనా, గిరిజన సబ్ నిధులు దారిమళ్లించడంపైనా ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు.

బహుజనులు పోరాటాలకు సిద్ధంకావాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : రాజ్యాధికారం చేపట్టడానికి ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ బహుజనులు నిబద్ధులు కావాలని సీనియర్ ఐఎఎస్ అధికారి విజయకుమార్ పిలుపునిచ్చారు. అంబేద్కర్ స్ఫూర్తితో ముమ్ముందు పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. గురువారం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర స్థాయి ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ సంఘం నాయకుల సమావేశం జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ బలం, బలగాన్ని గుర్తెరిగి ఐక్యమత్యంతో నిర్ణయాధికారాన్ని సొంతం చేసుకోవాలన్నారు. ఇంటర్నేషనల్ దళిత జర్నలిస్ట్ నెట్‌వర్క్ (ఐడిజెఎన్) ఏపి ఛాప్టర్ అధ్యక్షులు తంగేటి నానాజీ (నాని) మాట్లాడుతూ బహుజనులను ఐక్యం చేయగలిగితే రాజ్యాధికారాన్ని సొంతం చేసుకోవడం పెద్ద కష్టమేమీ కాదన్నారు. 80 శాతం బహుజనులను 20 శాతం అగ్రకుల నాయకులు పాలించడం ఏంటని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఐడిజెఎన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సత్యనారాయణ, విశాఖ జిల్లా ఛాప్టర్ అధ్యక్షులు ధనుష్, భీమ్ సేన నాయకులు రవి సిద్ధార్థ, జై భీమ్ సంస్థ నిర్వాహకులు కోన ప్రకాష్ పాల్గొన్నారు.

వైసిపి జిల్లా అధ్యక్షునిగా కోలా గురువులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వైసిపి జిల్లా అధ్యక్షునిగా కోలా గురువులు నియమితులయ్యారు. ఈ మేరకు అధిష్టానం నుంచి ఉత్తర్వులు అందాయి. మొన్నటి వరకూ జిల్లా అధ్యక్షునిగా పనిచేసి ఇటీవల ఆ పదవికి, వైసిపి సభ్యత్వానికి పంచకర్ల రమేష్‌బాబు రాజీనామా చేసి జనసేనలో చేరిన విషయం తెలిసిందే. దీంతో ఖాళీగా ఉన్న అధికార పార్టీ జిల్లా అధ్యక్ష పదవికి కాసింత పోటీ నెలకొన్నా చివరకు గురువులువైపే అధిష్టానం మొగ్గుచూపింది.

రహదారి లేక అవస్థలు

మృతదేహాన్ని 8 కిలోమీటర్లు మోసుకుంటూ తీసుకెళ్లిన వైనం
రోడ్డు ఏర్పాటు చేయాలి : గాలికొండ ఎంపిటిసి బుజ్జిబాబు

ప్రజాశక్తి -సీలేరు

గ్రామానికి రహదారి లేక మృతదేహాన్ని 8 కిలోమీటర్లు మేర మోసుకుంటూ తీసుకెళ్లాల్సిన దుస్థితి జికె.వీధి మండలం ఎ.దారకొండ పంచాయతీ పరిధిలో చోటుచేసుకుంది. ఎ.దారకొండ పంచాయతీ పరిధి గొల్లపల్లి గ్రామానికి చెందిన చిలకల ఏసుబాబు భార్య దేవి (22) అనారోగ్యంతో చింతపల్లి ఆసుపత్రిలో ఈ నెల 20న గురువారం మృతి చెందింది. మృతదేహాన్ని వారి సొంత గ్రామానికి తీసుకెళ్లడానికి అంబులెన్స్ ఇచ్చారు. కానీ రహదారి సౌకర్యం అనే కష్టాలకు గురయ్యారు. రహదారి సౌకర్యం లేకపోవడంతో గ్రామానికి ఎనిమిది కిలోమీటర్ల ముందు శ్యామగడ్డ గ్రామంలో మృతదేహాన్ని దింపడంతో అక్కడ నుంచి గ్రామస్తులు సహకారంతో వాగులు వంకలు దాటుకుంటూ సొంత గ్రామానికి మోసుకుంటూ తీసుకెళ్లాల్సిన దుస్థితి నెలకొంది.



వాగులోంచి మృతదేహాన్ని మోసుకెళ్తున్న గిరిజనులు

రహదారులు ఏర్పాటు చేయాలి

జీకే వీధి మండలం ఏ.దారకొండ పంచాయతీ గొల్లపల్లి, పెబ్బంపల్లి, తడకపల్లి గ్రామాలకు రహదారులు ఏర్పాటు చేయాలని గాలికొండ ఎంపీటీసీ అంపరంగి బుజ్జిబాబు డిమాండ్ చేశారు. ఆయన గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చి 75 సంవత్సరాలు గడుస్తున్నా ఆయా గ్రామాలకు రహదారి సౌకర్యం లేక గిరిజనులు అష్ట కష్టాలు పడుతున్నారని వాపోయారు. గిరిజనులు అనారోగ్యం పాలైనప్పుడు రహదారి సౌకర్యం లేక ఎంతోమంది మృత్యువాత గురైన సందర్భాల్లో ఎన్నో ఉన్నాయని పేర్కొన్నారు. అత్యవసర సమయంలో డోలిమాత తెప్పడం లేదని విచారం వ్యక్తం చేశారు. అనేకసార్లు అధికారులకు రాజకీయ నాయకులకు విన్నవించిన పట్టించుకోలేదని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆయా గ్రామాలకు రోడ్డు సౌకర్యం తక్షణమే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.



క్షతగాత్రున్ని పరామర్శిస్తున్న సభ్యులు

క్షతగాత్రులకు సహాయం

ప్రజాశక్తి - రంపచోడవరం : మండలంలోని పెద్ద గెద్దాడ వద్ద లారీ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రి ఐసీయూలో చికిత్స పొందుతున్న రంపచోడవరం మండలంపెదపాడు గ్రామానికి చెందిన కత్తుల రవితేజరెడ్డి (21), ఎర్రగొండ రాజారావు(23)ను కారం సీతారామన్న దొర (ఢిల్లీ బాబు) టిమ్ సభ్యులు పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. క్షతగాత్రులకు అత్యవసరంగా కావలసిన బి పాజిటివ్ రక్తాన్ని సమకూర్చారు. రెండు కుటుంబాల సభ్యులకు వారికి కావలసిన అల్పాహారం, భోజనం, పళ్ళు, పాలు బ్రెడ్లు, సబ్బులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కత్తుల అబ్బాయి రెడ్డి, జి ప్రభుజార్జ్, వై ఆశిక్, జి దుర్గాప్రసాద్, పి నాగరాజు పాల్గొన్నారు.

ఎయులో..
'ఒక్కడే వీరుడు అల్లూరి' అభినందన సభ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఎయు తెలుగు విభాగం ఆధ్వర్యంలో 'ఒక్కడే వీరుడు అల్లూరి సీతారామరాజు' సినిమా అభినందన సభ గురువారం జరిగింది. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఆచార్య జర్రా అప్పారావు మాట్లాడుతూ వ్యాపార ధోరణిలో సినిమాలు తీస్తున్న ప్రస్తుత తరుణంలో ఎటువంటి లాభాపేక్షకూ తావులేకుండా ఒక జాతి ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటాలనే తపనతో చిత్ర నిర్మాత రాజాసాగి సత్యనారాయణరాజు అల్లూరి సీతారామరాజు చిత్రాన్ని తెరకెక్కించి మన ముందుకు తీసుకురావటం, ప్రీ రిలీజ్‌ను తమ శాఖలో జరపాలనుకోవడం చాలా గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో అల్లూరి చిత్ర నిర్మాత రాజాసాగి సత్యనారాయణరాజు, విశాఖ జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు మేడా మస్తాన్ రెడ్డి, డాక్టర్ అన్నంశెట్టి ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

'మణిపూర్' నిందితులను కఠినంగా శిక్షించాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : మణిపూర్‌లో ఇద్దరు మహిళలను వివస్త్రలను చేసి ఊరేగించి, ఆ పిదప అత్యాచారం చేసినట్లుగా వార్తలు వస్తున్న నేపథ్యంలో ఈ ఘటనపై విచారణ జరిపి నిందితులను కఠినంగా శిక్షించాలని ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ విశాఖపట్నం డివిజన్ ప్రధాన కార్యదర్శి జి.వరప్రసాద్, మహిళా విభాగం కన్వీనర్ జి.సూర్యప్రభ డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. మణిపూర్‌లో అల్లర్లు చెలరేగుతుంటే విశ్వ గురువులమని ప్రగల్భాలు పలికే పెద్దలు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. కుల, మత, ప్రాంత విద్వేషాలన్నింటిలో మహిళలు బలిపశువులుగా మారుతున్నారని ఆవేదన వెలిబుచ్చారు. మూడు మాసాలుగా చెలరేగుతున్న మణిపూర్ హింసను కేంద్రం నిర్లక్ష్యం చేయడం వల్ల సమస్య మరింత జఠిలమైందన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

జిల్లాలో 1.23 లక్షల సర్టిఫికెట్లు ఇచ్చాం

ప్రజాశక్తి-కొయ్యూరు : జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా జిల్లాలో గత 20 రోజుల వ్యవధిలో 1,23,000 సర్టిఫికెట్లు జారీ చేసినట్లు పాడేరు శాసనసభ్యులు, వైసిపి అల్లూరి జిల్లా అధ్యక్షులు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి వెల్లడించారు. కొయ్యూరులో గురువారం నిర్వహించిన జగనన్న సురక్ష సక్సెస్ ప్రెస్ మీట్‌లో భాగ్యలక్ష్మి మాట్లాడుతూ అల్లూరి జిల్లా పాడేరు, అరకు, రంపచోడవరం నియోజకవర్గాల్లో 2 లక్షల 44 వేల గృహాలను వాలంటీర్లు, గ్రహసారథులు సందర్శించి లక్ష 86 వేల టోకెన్లు జనరేట్ చేయగా, వాటిలో లక్ష 23 వేల సర్టిఫికెట్లు మంజూరు చేశామని చెప్పారు. ఈ 20 రోజుల్లో 251 జగనన్న సురక్ష క్యాంపులను విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. వాలంటీర్ వ్యవస్థ అంతా ఇంత గొప్ప కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిందని తెలిపారు. ఈ సమావేశంలో స్థానిక సర్పంచ్ సిగ్గె సూరిబాబు, ఎంపిటిసి కమటం అర్జమ్మ, ఎంపీపీ బడుగు రమేష్, వైస్ ఎంపీపీలు అప్పన వెంకటరమణ, నూకాలమ్మ, వైసిపి నాయకులు జల్లి బాబులు, జైతి రాజులమ్మ, గాడి నాగమణి, ధోని బాబ్జి, అచ్యుత్, బండి సుధాకర్, రేగటి ముసలి నాయుడు, సడ్డా సావిత్రి, అప్పన గజ్జయ్యదొర, పలువురు సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, నాయకులు పాల్గొన్నారు.

రాజన్న ఆటోనగర్ నిర్మాణం చేపట్టాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఆనందపురం మండలం కమనం గ్రామంలో ప్రభుత్వం ప్రతిపాదించిన రాజన్న ఆటోనగర్ నిర్మాణ పనులను వెంటనే చేపట్టాలని స్మార్ట్ విశాఖ ఆటో పార్ట్స్ అండ్ డీలర్స్ యూనియన్ అధ్యక్షులు పఠాన్ ఖాజీవలి, నేషనల్ దళిత జెఎసి చైర్మన్ పెరిక వరప్రసాద్ కోరారు. గురువారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు.

సెంచురీ క్లబ్ అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : స్థానిక బీచ్ రోడ్‌లోని సెంచురీ క్లబ్ అభివృద్ధికి కృషి చేస్తానని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. క్లబ్ ఆవరణలో కోటిన్నర రూపాయలతో పునర్నిర్మించే భవనానికి ఆయన విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, నెడ్ క్యాప్ చైర్మన్ కెకె.రాజుతో కలిసి గురువారం శంకుస్థాపన చేశారు. అ సందర్భంగా మాట్లాడుతూ ఈ క్లబ్‌కు సుమారు 90 సంవత్సరాల చరిత్ర ఉందని చెప్పారు. క్లబ్ పూర్వ అధ్యక్షులు దంతులూరి దిలీప్ కుమార్ మాట్లాడుతూ అత్యంత పురాతనమైన ఈ క్లబ్‌కు ప్రభుత్వం స్థలాన్ని కేటాయించాలని కోరారు.

బిఎస్ఎన్ఎల్ కార్మికుల నిరసన

ప్రజాశక్తి - కలెక్టరేట్ : బిఎస్ఎన్ఎల్‌లో పనిచేస్తున్న క్యాజువల్ కాంట్రాక్టు ఉద్యోగులందరికీ బిఎస్ఎన్ఎల్ సంస్థ ద్వారా జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ గురువారం డాబాగార్డెన్స్‌లోని బిఎస్ఎన్ఎల్ పిజిఎంటిడి కార్యాలయం ప్రధాన ద్వారం వద్ద ఉద్యోగులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి పిఇసిహెచ్‌వి.సాగర్ మాట్లాడుతూ క్యాజువల్ కాంట్రాక్టు ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. వీరందరికీ బిఎస్ఎన్ఎల్ ద్వారా జీతాలు ఇవ్వాలని, మెడికల్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. స్కిల్డ్, సెమీ స్కిల్డ్‌కు ప్రభుత్వం చెప్పిన విధంగా జీతాలు చెల్లించాలని కోరారు. బిఎస్ఎన్ఎల్‌కు 4జిని వెంటనే ఇవ్వాలన్నారు. సిసిడబ్ల్యుఎఫ్ జిల్లా కార్యదర్శి లింగమూర్తి, అధ్యక్షులు సూర్య ప్రకాష్‌రావు నాయకత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు సురేష్, సరిపల్లి శ్రీను, ప్రేమ్ కుమార్, నాగిరెడ్డి, సింహాచలం, గోవిందరావు పాల్గొన్నారు.